ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
05-10-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 32 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## లడ్డూ వివాదంపై సుప్రీం సిట్ ఏర్పాటు

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 4:**

లడ్డూ కల్తీపై సుప్రీం కోర్టులో ప్రారంభమైన విచారణ.. టీటీడీ తరఫున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. సిట్ సభ్యులపై మాకు ఎలాంటి సందేహాలు లేవని రోహత్గి అభిప్రాయపడ్డారు. అయితే కేంద్ర అధికారి పర్యవేక్షణ ఏర్పాటు చేస్తే మంచిదని తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. లడ్డూ కల్తీపై కేంద్ర ప్రభుత్వ అధికారి పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరగాలని జస్టిస్

...మిగతాది 2 లో





## సుప్రీం కోర్టులో ఈషాకు ఊరట

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 4:**

మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో కోయంబత్తూరులోని ఈషా యోగా సెంటర్‌లో పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలకు బ్రేక్ పడింది. మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ పిటిషన్‌ను విచారించిన చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం కామరాజ్ కుమార్తెలతో తాను మాట్లాడానని వారు ఇష్టపూర్వకంగానే ఈషా ఆశ్రమంలో ఉంటున్నట్లుగా చెప్పారన్నారు. ఈషా ఆశ్రమంపై దాఖలైన ఇతర కేసుల వివరాలన్నింటినీ తమ ముందుఉంచాలని ఆదేశించిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఆక్టోబర్ 18వ తేదీకి వాయిదా వేసింది.కామరాజ్ అనే రిటైర్డ్ ప్రొఫెసర్ ఇద్దరి

...మిగతాది 2 లో



# రైతుల అకౌంట్లలోకి డబ్బులు

## 20 వేల కోట్లు నిధుల బదిలీ

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 4:**

పీఎం కిసాన్ యోజన డబ్బులు కోసం ఎదురు చూస్తున్న రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. శనివారం ఉదయం రైతుల ఖాతాల్లో డబ్బులు వేయబోతోంది కేంద్రం. 9.5 కోట్ల మంది రైతుల ఖాతాల్లో 20 వేల కోట్లకుపైగా నిధులను బదిలీ చేయబోతోంది. మహారాష్ట్రలోని వాషిమ్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిధులు విడుదల చేస్తారు.
రైతుల ఖాతాల్లో రెండు వేలు జమ. అర్హులైన రైతులందరికీ పిఎం కిసాన్ యోజన కింద సంవత్సరానికి రూ.6,000 సహాయం కేంద్రం అందిస్తోంది. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 17 విడతలుగా నిధులు అందిస్తూ వచ్చింది. 17వ విడత మొన్న జూన్‌లో రిలీజ్ అయింది. ఇప్పుడు 18 విడత నిధులు శనివారం విడుదల చేయనుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది కేంద్రం. 2 హెక్టార్ల వరకు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులంతా ఈ పథకానికి అర్హులు. పిఎం కిసాన్ యోజన సొమ్ము ఖాతాల్లో జమ చేయాలంటే మాత్రం కేవైసీ తప్పనిసరిగా చేసి ఉండాలి. లేకుండా డబ్బులు వేయడానికి వీలుపడదని అధికారులు చెబుతున్నారు. పీఎం కిసాన్ యోజనకు అర్హులైన రైతులు మూడు విధాలుగా ఈ కేవైసీ చేసుకోవచ్చు. ఓటీపీఆధారిత ఈ కేవైసీ, బయోమెట్రిక్‌ఆధారిత ఈ కేవైసీ, నేరుగా బ్యాంకుకు వెళ్లి ఈ కేవైసీ చేసుకోవాల్సి ఉంటుంది.

...మిగతాది 2 లో





## సంపడానికి అయినా.. సావడానికి అయినా సిద్ధం...

- రేవంత్ రెడ్డి అసలు ముఖ్యమంత్రి లాగా మాట్లాడుతున్నాడా..!
- కన్నీరుమున్నీరవుతున్న మూసీ బాధితులు ..
- కడుపు మంటతో కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు

**జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 4:**

కండ్ల ముందే తమ ఇండ్లను నిర్దాక్షిణ్యంతో కూల్చివేస్తుండటంతో మూసీ బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. కడుపు మంటతో కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతున్నారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డిపై తమ కోపాన్ని వెల్లగక్కుతున్నారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.35 ఏండ్ల నుండి ఇక్కడ ఉంటున్నాం.. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని ఓ మూసీ బాధితురాలు తెలిపింది. రేవంత్ రెడ్డి అసలు ముఖ్యమంత్రి లాగా మాట్లాడుతున్నాడా అని ప్రశ్నించింది. లక్ష మంది మూసీ బాధితులం జేసీబీలు తీస్కొని రేవంత్ రెడ్డి ఇంటి మీదకు పోతామని వార్నింగ్ ఇచ్చింది. రేవంత్ రెడ్డిని సంపడానికి అయినా సావడానికి అయినా సిద్ధమని స్పష్టం చేసింది. మాది అక్రమ ఇల్లు అంటే చెప్పు తీసుకొని కొడతామని బాధితురాలు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ చెత్త మొత్తం పోసే జవహర్ నగర్ చెత్త కుప్పలో మమ్మల్ని ఉండమంటవా అని ప్రశ్నించింది. రూపాయి రూపాయి జమ చేసి కట్టుకొని ఇల్లు వదిలేసి ఆ చెత్త కుప్పలో మేమెందుకు ఉండాలని ప్రశ్నించింది. రేవంత్ రెడ్డినే అక్కడ ఉండమనండని తెలిపింది. ఎవడొచ్చి ఇల్లు కూలుస్తాడో అని నిద్ర పట్టట్లేదని వాపోయింది. రేవంత్ రెడ్డిని సీఎం సీటు నుంచి దింపేస్తామని స్పష్టం చేసింది.

## సంక్రాంతి మరో పథకం



**జయభేరి, విజయవాడ, అక్టోబరు 4:**

ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువు దీరి నాలుగు నెలలు అవుతోంది.ఒక్కో పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల మొత్తాన్ని పెంచి అందించింది.గత నాలుగు నెలలుగా విజయవంతంగా అందించగలిగింది.అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి శ్రీకారం చుట్టనుంది. డీఎస్సీ నోటిఫికేషన్ ప్రక్రియ పై కసరత్తు జరుగుతుంది. అందుకు సంబంధించి ఫైల్ పై ఎప్పటికీ సీఎం చంద్రబాబు సంతకం చేశారు. మరోవైపు సంక్రాంతికి మరో కొత్త పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. పి4 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాలు తరహాలో స్వచ్ఛ సేవకుల కోసం ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టనున్నారు. అలాగే డ్వాక్రా సంఘాలకు

...మిగతాది 2 లో




## భారీగా పెరిగిన విమాన టిక్కెట్లు

**జయభేరి, ముంబై, అక్టోబరు 4:**

ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య జరుగుతున్న ఘర్షణతో హైదరాబాద్ నుంచి అమెరికాకు వయా లండన్ ద్వారా వెళ్తున్న ప్రయాణికులకు టికెట్లు ధరలతో చుక్కలు కనిపిస్తున్నాయి. విమాన టిక్కెట్ల ధరలు 50 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి విమానాలు మళ్లించడంతో హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాకు విమాన ప్రయాణ ఖర్చులు భారీగా పెరిగాయి. హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లాల్సిన విమానాలు వయా లండన్ వెళుతుండడంతో విమానాల టికెట్ ధరలు రూ. 1.5 లక్షల మార్క్ దాటాయి.సాధారణంగా టిక్కెట్ ధరలు రూ. 90,000 నుంచి రూ. 1 లక్ష వరకు ఉంటాయి. కానీ తాజా ఘటనల కారణంగా మిడిల్ ఈస్ట్ దేశాలు దాటే విమాన సర్వీసులు రద్దు చేయడంతో ఇతర మార్గాలు మళ్లించడం వల్ల టిక్కెట్ల ధరలు భారీగా పెరిగాయి. కాంటినెంటల్‌తోపాటు అనేక ఇతర విమాన సర్వీసులు హైదరాబాదు నుంచి న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, శాన్‌ఫ్రాన్సిస్కో, అట్లాంటా, హ్యూస్టన్ నగరాలకు టిక్కెట్ ధరలను పెంచాయి. డల్లాస్ వంటి నగరాలకు ప్రస్తుతం టిక్కెట్లు రూ. 3 లక్షలకు చేరుకున్నాయి. లుఫ్తాన్సా విమాన సర్వీసులు హైదరాబాదు, ముంబయ్ వంటి నగరాలకు తమ సర్వీసులను రద్దు చేశాయి. ముఖ్యంగా ఇరాన్‌ఇజ్రాయెల్ ఘర్షణ కారణంగా మిడిల్ ఈస్ట్ దాటే సర్వీసులు రద్దు చేయబడుతున్నాయి. యూఎస్, యూకే వెళ్లే భారతీయ ప్రయాణికులకు గణనీయంగా

...మిగతాది 2 లో

## సారీ చెబితే నష్టం పూడ్చినట్టేనా

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు4:**

తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అదిక్రం లో ఉన్న విషయం మనకు తెలిసిందే. ఇక ఆ పార్టీ లో ఫారెస్ట్ మినిస్టర్ గా కొనసాగుతున్న కొండా సురేఖ రీసెంట్ గా సమంతను అక్కినేని ఫ్యామిలీ ని ఉద్దేశించి కొన్నిసభ్యకరమైన వ్యాఖ్యలు అయితే చేసింది. ఇక దానిమీద పలువురు సినిమా సెలబ్రిటీలు సైతం చాలా ఘాటు గా రియాక్ట్ అయ్యారు. ఆమె మాట్లాడిన దాంట్లో చాలా వరకు తప్పు ఉందని చెప్పడంతో వెంటనే ఆమె తను అలా మాట్లాడడం తప్పు అంటూ అక్కినేని ఫ్యామిలీకి సమంతకు సారీ చెప్పింది. ఇక్కడితో రచ్చ మొత్తం ముగిస్తుందని అందరు అనుకున్నారు. కానీ ఇప్పుడు సారీ చెప్పినంత మాత్రాన ఆమె మాట్లాడిన మాటలు గాని వాళ్ళ గురించి జనాల్లోకి వెళ్లిన న్యూస్ కానీ వెనక్కి తిరిగిరాదు కదా... అందుకే ఏదైనా మాట్లాడే ముందు ఇలాంటివి ఒకటికి రెండుసార్లు చూసుకుని మాట్లాడితే బాగుంటుంది అంటూ పలువురు సినీ సెలబ్రిటీలు కూడా ఆమె మీద తీవ్రంగా ఫైర్ అవుతున్నారు. నిజానికి సినిమా సెలబ్రిటీల మీద రాజకీయ నాయకులు తరచుగా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. మరి వాళ్ళకి సినిమా ఇండస్ట్రీ అంటే ఎందుకు నచ్చదో ఎవరికి తెలియదు. ఇక మొత్తానికైతే వాళ్ళు చేసిన వాక్యాలు చిన్న సారీ తో సరిపెట్టుకునేవి అయితే కావు. దీనివల్ల ఎవరైతే కామెంట్స్ కి గురవుతారో వాళ్ళ కుటుంబాలు సఫర్ అవుతూ ఉంటాయి.అలాగే వాళ్ళ ఫ్యాన్స్ కూడా చాలా ఇబ్బందిని ఫేస్ చేస్తూ ఉంటారు. అందువల్లే ఒకసారి ఏదైనా మాట మాట్లాడేటప్పుడు ఒకటికి పది సార్లు ఆలోచించుకొని మాట్లాడితే బాగుంటుంది. మాట్లాడిన తర్వాత సారీ చెబితే జరిగిన నష్టాన్ని భర్తీ చేసే అవకాశం ఉండకపోవచ్చు. ఇక

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## లడ్డూ వివాదంపై సుప్రీం సిట్..

గవాయ్ అన్నారు. స్వతంత్ర దర్యాప్తు ఉంటేనే రాజకీయ జోక్యం ఉండదు జస్టిస్ గవాయ్ తెలిపారు. స్వతంత్ర దర్యాప్తుపై ఎలాంటి అభ్యంతరం లేదని కపిల్ సిబల్ పేర్కొన్నారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ లడ్డు కల్తీ వివాదంపై దర్యాప్తు చేసేందుకు సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కొత్త సిట్‌ను ఏర్పాటు చేసింది. అంటే రాష్ట్ర సిట్‌ను కోర్టు రద్దు చేసింది. ఇప్పుడు ఈ కేసు దర్యాప్తు చేస్తున్న కొత్త సిట్‌లో ఇద్దరు సీబీఐ అధికారులు ఉంటారు. ఇది కాకుండా, బృందంలో రాష్ట్ర పోలీసు నుండి ఇద్దరు వ్యక్తులు, FSSAI నుండి ఒక అధికారి ఉంటారు. ఈ క్రమంలోనే ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించాలని కోర్టు స్పష్టం చేసింది. తిరుమల వివాదంపై పదిన్నరకు సుప్రీంకోర్టులో ప్రారంభమైన విచారణలో కేంద్రం తరపున తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రస్తుతం లడ్డూ వివాదంలో ఏపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని అది కొనసాగితే మంచిదన్నారు. ఆ సిట్ సభ్యులపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారిపై నమ్మకం ఉందని పేర్కొన్నారు. దీనిపై పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన కపిల్ సిబాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం కూడా ప్రభుత్వంలో ఉన్న మరో కీలకమైన వ్యక్తి తిరుమల లడ్డూ వివాదంపై మాట్లాడారని గుర్తు చేశారు. ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులు ఇలా మాట్లాడుతుంటే సిట్ దర్యాప్తుపై ప్రభావం పడుతుందని అందుకే సిట్‌పై తమకు పూర్తిగా నమ్మకం లేదని అన్నారు. అన్ని వర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు జరిపితే మంచిదని జస్టిస్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ బెంచ్ అభిప్రాయపడింది. ఇలా అయితే రాజకీయ జోక్యం అనే అనుమానం లేకుండా ఉంటుందని తెలిపారు. ఈ స్వతంత్ర దర్యాప్తులో కేంద్ర రాష్ట్ర అధికారులతోపాటు ఫుడ్ సేఫ్టీ అథారిటీ నుంచి అధికారులు ఉంటే మంచిదన్నారు. సొలిసిటర్ జనరల్ పాత సిట్‌పై విశ్వాసం వ్యక్తం చేసినప్పటికీ, కోర్టు కొత్త సిట్‌ను ఏర్పాటు చేసింది.తిరుమల లడ్డూ వ్యవహారంలో రాజకీయ డ్రామాలు వద్దని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ.. ఇది రాజకీయ డ్రామాగా మారకూడదని, స్వతంత్ర సంస్థ ఉంటే ఆత్మవిశ్వాసం ఉంటుంది.ఇదిలా ఉండగా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని గత ప్రభుత్వం హయాంలో తిరుపతిలో లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును ఉపయోగించారని పేర్కొన్నారు. చంద్రబాబు చేసిన ఈ ప్రకటన తర్వాత రాజకీయంగా పెద్ద దుమారం రేగింది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీంకోర్టులో మూడు కంటే ఎక్కువ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌ను దాఖలు చేసిన వారిలో సుబ్రమణ్యస్వామి, రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, చరిత్రకారుడు విక్రమ్ సంపత్‌లు ఉన్నారు. వీటిపై సెప్టెంబర్ 30న విచారణ జరిపారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ విషయంలో దేవుడిని కనీసం రాజకీయాలకు దూరంగా ఉంచాలని సుప్రీం కోర్టు పేర్కొంది.

## సుప్రీం కోర్టులో ఈషాకు ఊరట

కుమార్తెలు పెళ్లి చేసుకోకుండా ఈషా ఫౌండేషన్‌లో సన్యాసినులుగా చేరిపోయారు. వారిద్దరూ ఇంటికి వచ్చేందుకు నిరాకరించారు. దీంతో కామరాజ్ ఈషా ఫౌండేషన్ లో తన కుమార్తెలకు బ్రెయిన్ వాష్ చేసి సన్యాసం స్వీకరించేలా చేశారని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టులో విచారణ జరిగింది. విచారణకు కామరాజ్ ఇద్దరు కుమార్తెల్ని కూడా హైకోర్టు పిలిపించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు కామరాజ్ కుమార్తెల అభిప్రాయం తెలుసుకున్నారు. తాము ఇష్టపూర్వకంగానే ఈషా ఫౌండేషన్ లో ఉన్నామని అక్కడే జీవనం సాగిస్తామని తెలిపారు. వారిద్దరికీ దాదాపుగా 40 ఏళ్ల వయసు ఉంటుంది. ఇదే సమయంలో కామరాజ్ తరపు లాయర్లు ఇషా ఫౌండేషన్ పై ఇలాంటి కేసులు చాలా ఉన్నాయని వాదించారు. దీంతో ధర్మాసనం అ కేసుల వివరాలన్నింటినీ తమ ముందు ఉంచారని ఆదేశించి.. అదే సమయంలో ఆశ్రమంలో సోదాలు నిర్వహించాలని తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పు కారణంగా నూట యాభై మంది పోలీసులు కోయంబత్తూరు ఈషా ఆశ్రమంలో తనిఖీలు చేశారు. అయితే తమపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా వేధిస్తున్నారని చెప్పి ఈషా ఫౌండేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. తాము ఎవరినీ సన్యాసం తీసుకోమని బ్రెయిన్ వాష్ చేయడం లేదని అందరూ ఇష్టప్రకారమే వచ్చి ఆశ్రమంలో ఉంటున్నారని ఈషా ఫౌండేషన్ తెలిపింది. తమపై తప్పుడు ప్రచారం చేస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరికలు జారీ చేసింది. సుప్రీంకోర్టులో జరిగే తదుపరి విచారణలో ఈషా ఫౌండేషన్ పై పెట్టిన కేసుల స్టేటస్ ఆధారంగా ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

## రైతుల అకౌంట్లలోకి డబ్బులు

**ఓటీపీ ఆధారిత ఈ కేవైసీ : ఎలా ఎంచుకోవాలి**

1. పీఎం కిసాన్ యోజన వెబ్‌సైట్‌కి వెళ్లి, కిసాన్ కార్నర్ సెక్షన్‌పై క్లిక్ చేస్తే అందులో ఈ కేవైసీ విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేయాలి.
2. అందులో ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. వెంటనే మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది దాన్ని అందులో ఎంటర్ చేయాలి.
3. ఓటీపీని ఫిల్ చేసిన వెంటనే ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి అయినట్టు సమాచారం వస్తుంది.

కొత్త ఈ పథకానికి అర్హులైన వాళ్లు ఈ ప్రక్రియను ఫాలో కావాల్సి ఉంటుంది.

**1. నమోదు ప్రక్రియ**

ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి రైతులు ముందుగా తన పేరును నమోదు చేసుకోవాలి. అలా నమోదు చేసుకోకుంటే ప్రయోజనాలు కోల్పోతారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

**2. ఆధార్ నంబర్‌కు లింక్ చేయడం**

రైతుల భూ రిజిస్ట్రేషన్‌తో ఆధార్ నంబర్ అనుసంధానమై ఉండాలి. అలా లేకపోతే మాత్రం దరఖాస్తు పెండింగ్‌లో ఉంటుంది. ప్రభుత్వం సాయన్ని అందుకోలేరు.

**3.భూమి యాజమాన్య హక్కు పత్రాలు**

వ్యవసాయ భూమి తనదే అని చెప్పే యాజమాన్య హక్కు పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. భూమి మీది అయినా అది పేరు మీద లేకుంటే మాత్రం పథకానికి అర్హులుకారు.

**4. మార్గదర్శకాలను అనుసరించడం**

ఇతర వేరే కేంద్రం ఇచ్చే రైతు పథకాల సాయం తీసుకోని వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఏదైనా ఇతర పథకం నుంచి ఆర్థిక సహాయం పొందుతే మాత్రం PM కిసాన్ యోజనకు అర్హులు.

## భారీగా పెరిగిన విమాన టిక్కెట్లు

ధరలు పెరిగాయి. హైదరాబాద్ నుంచి వెళ్లే వారికి పెరిగిన టికెట్ ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి.ఇప్పుడు ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం పలు అంశాల్లో ప్రపంచ దేశాలపై ప్రభావం చూపిస్తుంది. ఇటీవలే ఇరాన్ వందకుపైగా క్షిమిపణులతో ఇజ్రాయెల్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్‌కు అగ్రదేశమైనా అమెరికా మద్దతు పలుకుంది. దీంతో ఈ ఘర్షణ మరో యుద్ధానికి దారి తీస్తుందేమోనని ఆయా దేశాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## సారీ చెబితే నష్టం పూడ్చినట్టేనా

ఈ సంఘటన మీద కొండ సురేఖ సారీ చెప్పినప్పటికీ సమంత అభిమానులు గాని, అక్కినేని ఫాన్స్ గాని ఆమెను తీవ్రంగా విమర్శిస్తున్నారు.ఇక సగటు ప్రేక్షకుడు ఇలాంటి సంఘటనలు నిజంగానే జరిగాయా అని నమ్మే అవకాశాలు కూడా ఉన్నాయి. కాబట్టి జనం చేత ఎన్నుకోబడిన నాయకుడు జనాన్ని కాపాడాల్సింది పోయి ఇలాంటి చీప్ మాటలు మాట్లాడటం వల్ల వాళ్ల పరువును వాళ్ళు తీసుకోవడమే కాకుండా ఎదుటి వాళ్ళను కూడా ఇబ్బందుల్లోకి నెట్టిన వారవుతారు. ఇక ఇదిలా ఉంటే ఇప్పుడు జరుగుతున్న దాన్ని బట్టి చూస్తే ఆమె మీద అక్కినేని అభిమానులు సమంత అభిమానుల కోపం ఇంకా చల్లారినట్టుగా కనిపించడం లేదు. ఇక ఈ విషయం ఎక్కడి దాకా వెళుతుంది అనేది తెలియాలంటే మాత్రం మనం వేచి చూడాల్సిందే...

# మత విశ్వాసాలతో రాజకీయమా..!?

## దేశ సమగ్రతకు ముప్పు తెచ్చే రాజకీయాలు మనకు అవసరమా!?

**ప్రజా సంక్షేమం అభివృద్ధి దిశగా రాజకీయం అడుగులు వేయాలి కానీ మత విశ్వాసాలపై రాజకీయం ఎటువైపు దారితీస్తోంది!?**

**భిన్నత్వంలో ఏకత్వం ఇంతవరకు దేశం ప్రపంచ దేశాల్లో పేరు సంపాదించుకుంది కానీ ఇప్పుడు!?**

**మత విశ్వాసాలను ప్రతి ఒక్కరు గౌరవించాలి కానీ రాజకీయాలకు దూరంగా ఉంచాలి అనే అనేక విషయాలపై "జయభేరి" సగర్వంగా అందిస్తున్న ధారావాహిక కథనం కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్ట్ రాజకీయ సమగ్ర విశ్లేషణ.**





✍ **కడారి శ్రీనివాస్**

**కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత గాయకులు, సామాజిక ఉద్యమకారులు**

✍ **జయభేరి, హైదరాబాద్ :**

79 ఏళ్లకు మన దేశం స్వాతంత్రం వచ్చి, జనవరిలో 80 ఏళ్లకు స్వాతంత్రం వయస్సు మీద పడుతున్న ఇంకా మనం వెనుకకు వెళ్లే రోజులను గుర్తు చేసుకుంటూ రాజకీయం పూర్తిగా రంగులు మారుతూ మానవ మనుగడకు ముప్పు వాటిల్లె ప్రమాదం ఏర్పడుతుంది. దీనికి అంతటికి కారణం నేటి రాజకీయాలు రాజకీయం చేయకుండా మనిషిని ముందరి కాళ్లకు బంధం వేసినట్టుగా మత రాజకీయాలకు పురుడు పోస్తోంది.. మతం మనిషిని మంచి వైపే పయనించాలి కానీ అదొక పిచ్చిగా వ్యసనంగా మారి మనిషిని ఆలోచన శక్తిని నశింపజేసి రాక్షసునిగా తయారు చేయకూడదు. ఎందుకంటే వారు ఆరాధించి అభిమానించి పూజించుకునే మతాల్లో రాక్షసులకు తగిన బుద్ధి చెప్పాలంటే ఆయుధాలు పట్టుకున్నారు మేం పట్టుకుంటే తప్ప అన్నట్టుగా ఒక వర్గం వారు తమ వాదనలు వినిపిస్తుంటే.. ఇంకొకరు ఆ దేవుడు చెప్పిందే మేం చేస్తాం దేవునిది రాజ్యం అంతా అంటూ విధ్వంసాలకు తెరలేపుతుంటే.. అసలు ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉందా లేక మత పరమైనటువంటి దేశమా!? అనేది అంతుపట్టట్లేదు. మతం బాటన మారణ హోమం సృష్టించడానికి రాజకీయాన్ని చేస్తున్న రాజకీయ నాయకులను ప్రజలు పసిగట్టాలి. మేధావులు వాళ్ళ గమనాన్ని లెక్క కడుతూ ప్రజలకు తెలియజేసే విధంగా తమ వీధిని నిర్వహించాలి. అంతేకానీ ఫలానా నాయకుడికి వత్తాసు పలుకుతూ ఫలానా పార్టీకి వంత పాడుతూ పూర్తిగా తమ విధిని మరిచిపోయే జర్నలిజం ఉన్నంతకాలం ఈ దేశం ఇలాగే నాశనం అయిపోవడానికి ఇలాంటి సందేహం లేదు. ఎంత ఎదుగుతున్నామో అంతకంతకు దిగజారిపోయే నేటి రాజకీయాల్లో పూర్తిగా మతం అనే ఒక సున్నితమైన అంశం రాజకీయ నాయకులు ఒంటికి తగిలించుకొని మిగతా మతాల వారి విశ్వాసాలను దెబ్బతీయకుండా రాజకీయంగా పది కాలాలపాటు అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్న ఆయా రాజకీయ పార్టీలు వాటి పనితీరు ఎలాంటివో ప్రజలు అర్థం చేసుకొని ఇలాంటి రాజకీయ నాయకులు మత పరమైనటువంటి సందేశాలు ఇస్తున్న వాటిని పరిగణలోకి తీసుకోకూడదు.

**మతం అంటే అదొక సున్నితమైన అంశం. ఏ మతమైనా ఏ దేవుడైన చెడు చేయి అని చెప్పదు. ఎందుకంటే ఆయా మతాల దేవుళ్ళు వారినే పూజించమని తమ రాజ్యాన్ని స్థాపించమని చెప్పే వారు అసలు వాళ్ళు దేవుళ్ళు ఎట్ల అవుతారు!? ఏ తల్లి బలులు కోరదు ఏ దేవుడు తన బిడ్డలను హింస పెట్టడు. ఇలాంటి సున్నితమైన అంశాలను ప్రజల మనోభావాలను దెబ్బతీసే రాజకీయ పార్టీలు మతాల పేరుతో రాజకీయం చేస్తూ అదేదో ధర్మానికి పెద్ద తప్పు పట్టిందని రాజ్యాంగ పదవిలో ఉండి ఇంకొకరి మత విశ్వాసాలను దెబ్బతీసే విధంగా రాజకీయం చేయడం దేనికి సంకేతం!?**

మనకున్న అన్ని మత గ్రంథాల్లో సాటి మనిషిని ప్రేమించమని ఒకరినొకరు గౌరవించుకోమనే చెబుతాయి. కానీ పనిగట్టుకొని ధర్మం కోసం పోరాడాల్సి వస్తుంది అని చెప్పుకుంటూ దానికి రాజకీయాన్ని అండగట్టే ఇలాంటి అవకాశవాద స్వార్థ రాజకీయ నాయకులను ప్రజలు కచ్చితంగా పసిగట్టి వారికి తగిన బుద్ధి చెప్పాలి. అంతేకానీ నా కులం వాడు నా మతం వాడు నా ప్రాంతం వాడు అని ఓట్లు వేస్తే రేపు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మతాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఆయన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఉండడం ఖాయం... శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ సూర్యుడు పై చంద్రుడిపై తమ ఉనికిని చాటుకోవాలని ఒకవైపు దేశం ముందడుగు వేస్తుంటే ఇవేవీ పట్టించుకోకుండా రాజకీయంగా తమ సీటును కాపాడుకోవడానికి ఎంతకైనా తెగించే ఇలాంటి వేషధార రాజకీయ నాయకులను చూసి కొత్తగా ఓటు వచ్చిన వాళ్ళు వారి ఫాలోవర్స్ గా మారిపోయి ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్యం మనుగడను బ్రస్టు పట్టించే అవకాశం లేకపోలేదు.

ప్రజాస్వామ్యం విభింద మతాలు విభిన్న కులాలు సర్వమత సమ్మేళనం భాష ప్రాంత ప్రాతిపదికన మన దేశంలో కొన్ని రాష్ట్రాలు కూడా ఏర్పడ్డాయి. అందుకనే భిన్నత్వంలో ఏకత్వం అని సార్వభౌమాధికారంగా దేశంగా మన దేశం ఎన్నో పోరాటాలు ఎన్నో ప్రాణ త్యాగాలు ఫలితంగా స్వతంత్రాన్ని దక్కించుకుంది. ఆనాడు ఒక కులం కాదు ఒక మతం కాదు ఒక ప్రాంతం వాడు కాదు నలు దిక్కుల దేశ రక్షణ కోసం స్వాతంత్ర సంగ్రామం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన ఆనాటి వీరులు వారి గాథలు చరిత్ర ఎప్పటికీ మరిచిపోదు. కానీ మతాన్ని అడ్డుపెట్టుకొని ఏకచత్రాధిపత్యాన్ని కొనసాగించాలనుకునే ఇలాంటి నీచ రాజకీయాలను ప్రజలు ఒకే ఒక్క ఓటుతో తమ నిర్ణయాన్ని తెలిపి సుస్థిర పాలనను కోరుకునే విధంగా ప్రజలు ఎవరికి అధికారం ఇస్తారో వారే పాలను కొనసాగించాలి. మత విశ్వాసాలతో రాజకీయమా!? రాజ్యాంగ పదవిలో ఉండి ఒకే మతాన్ని హెచ్చింపజేస్తూ చేస్తున్న కార్యక్రమాలు దేనికి సంకేతం? ఇదేనా భారతదేశం కోరుకున్న సంక్షేమం అభివృద్ధి. ప్రాంతాలు వేరైనా మతాలు వేరైనా మనమంతా ఒక్కటే భారతీయులం అని జాతీయవాదం ఎవరు నేర్పాలి? రాజకీయానికి అర్థం లేకుండా చేస్తున్న స్వార్థ రాజకీయ నాయకుల ఆశలకు అంతులేకుండా పోతున్న ఈ సందర్భంలో మతాన్ని అడ్డుపెట్టుకొని చేస్తున్న రాజకీయం నిజంగా అది దేశద్రోహమే!? మతాన్ని అడ్డుపెట్టుకొని చేసే రాజకీయ నాయకులను దేశ ద్రోహం గా పరిగణించి వారికి రాజ్యాంగపరంగా శిక్షణ విధించాలి! మతం ముందు పుట్టిందా.. మనిషి ముందు పుట్టాడా.. అంటే మనిషి ముందు పుట్టి తన కావలసిన మతాన్ని ఏర్పరుచుకున్నాడు తన కావలసిన విధి విధానాల్ని రాసుకున్నాడు ఒక మనిషిగా ఒక సంఘజీవిగా ఒక కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని తాను బ్రతకడానికి ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకొని రాజ్యాంగం కింద సర్వమత సమ్మేళనంతో మనమంతా సమానమే అంటూ ఏం లకేన్లు స్వతంత్ర ఫలాలు అనుభవిస్తూ ఇవాళ మత విశ్వాసాలతో రాజ్యాంగాన్ని అవమానపరిచేలా రాజకీయం చేయడం సమంజసం కాదు. కాలాలు మారుతున్నాయి మనుషులు మారుతున్నారు మానవ జీవన విధానం మారుతుంది మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్న ఈ సందర్భంలో మనిషి ప్రేమించలేని నీచ స్థితికి దిగిపోతున్న తరుణంలో మతాలకు రాజకీయాలు దూరంగా ఉండేలా చూసుకోవాలి అది మనమే కావాలి అది మన నుంచే మొదలవ్వాలి..

## సంక్రాంతి మరో పథకం

త్వరలో మైక్రోస్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ హోదా కల్పించడానికి కూడా సిద్ధపడుతున్నారు. ఇప్పటికే డ్వాక్రా సంఘాలకు 10 లక్షల రూపాయల రుణాలు ఇస్తున్నారు. వ్యక్తిగత రుణాల పరిమితిని రెండు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచారు. ఇప్పుడు డ్వాక్రా సంఘాల మాదిరిగానే స్వచ్ఛ సేవకుల కోసం ప్రభుత్వం ఆలోచన చేస్తుండడం విశేషం. వాస్తవానికి డ్వాక్రా సంఘాల ఏర్పాటు ఆలోచన చంద్రబాబుదే. 1999లో అధికారంలోకి వచ్చారు చంద్రబాబు. దీంతో మహిళల కోసం స్వయం ఉపాధి పథకాలు పెంచాలని భావించారు. అందులో భాగంగా పురుడు పోసుకున్నది డ్వాక్రా వ్యవస్థ.దేశంలోనే ఆదర్శంగా నిలిచింది వ్యవస్థ. ఏపీ ని చూసి చాలా రాష్ట్రాలు డ్వాక్రా వ్యవస్థను ప్రవేశపెట్టాయి. ఇప్పుడు తాజాగా చంద్రబాబు సర్కార్ స్వచ్ఛ సేవకుల వ్యవస్థను ప్రవేశ పెట్టేందుకు ముందుకు రావడం విశేషం.చంద్రబాబుకి నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం. 1995లో తొలిసారిగా సీఎం అయ్యారు చంద్రబాబు. అప్పటినుంచి మహిళల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. మహిళల అభిమానాన్ని చురగొన్నారు. 1999 ఎన్నికల్లో మహిళలు అండగా నిలవడం వల్లే చంద్రబాబు అధికారంలోకి రాగలిగారన్నది విశ్లేషకులు అభిప్రాయం.అయితే 2004, 2009 ఎన్నికల్లో మహిళలు ఆదరించకపోవడం వల్లే చంద్రబాబు ఓడిపోయారు. అందుకే చంద్రబాబు మహిళలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టడంతో 2014లో తిరిగి అధికారంలోకి వచ్చారు. ఈ ఎన్నికల్లో సైతం మహిళల కోసం అనేక పథకాలు ప్రకటించారు చంద్రబాబు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు అగ్రతాంబూలం ఇచ్చారు.తల్లికి వందనం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అందులో భాగమే. అయితే తాను మహిళా పక్షపాతి అని చాలా సందర్భాల్లో చంద్రబాబు చెప్పుకొచ్చారు. దీనిని ఇప్పుడు నిజం చేసే పనిలో పడ్డారు. అందుకే డ్వాక్రా సంఘాల కుటుంబాల కోసం స్వచ్ఛ సేవకుల వ్యవస్థను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. సంక్రాంతి నుంచి ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుండడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## లాయర్ ఖర్చు.. ఎవరిది..?

✍ **జయభేరి, తిరుమల, అక్టోబరు 4:**

తిరుమల లడ్డు వ్యవహారం యూటర్న్ తీసుకుంది. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇవ్వడం హాట్ టాపిక్ గా మారింది. కోట్లాదిమంది భక్తుల మనోభావాల విషయంలో.. రాష్ట్ర సీఎం గా ఉన్న చంద్రబాబు బాధ్యత రాహిత్యంగా ప్రకటనలు చేస్తే ఎలా అని అర్థం వచ్చేలా తప్పు పట్టింది. ఆధారాలు లేకుండా,సెకండ్ ఒపీనియన్ తీసుకోకుండా ఎలా బయటకు వెల్లడిస్తారని ప్రశ్నించింది. టీటీడీ లడ్డు తయారీకి సంబంధించి..నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందని చంద్రబాబు ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశంలో ప్రస్తావించారు. అక్కడి నుంచి రచ్చ ప్రారంభమైంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే సిట్ విచారణ నిలిపివేయాలని, సీబీఐ దర్యాప్తు ఏర్పాటు చేయాలని వైసీపీ నేత వైవి సుబ్బారెడ్డి, బిజెపి మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సుప్రీం కోర్టులో విచారణ ప్రారంభం అయింది. అయితే టీటీడీ తరుపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్ర వాదించారు.బలమైన వాదనలు వినిపించారు. ఇఅయితే ఈ కేసులో సిద్ధార్థ లూథ్ర ఎంటర్ కావడం చర్చకు దారితీస్తోంది. గతంలో చంద్రబాబుపై అక్రమ కేసుల్లో వాదనలు వినిపించారు ఆయన. చంద్రబాబుపై అవినీతి కేసులు నమోదైన సంగతి తెలిసిందే. దాదాపు 52 రోజులు పాటు ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.ఆ సమయంలో ఆయన ఏసీబీ కోర్టు నుంచి మళ్లీ సుప్రీంకోర్టు వరకు చంద్రబాబు తరపున వాదనలు వినిపించారు. చివరకు చంద్రబాబుకు బెయిల్ వచ్చేలా చేశారు. అయితే అప్పట్లో సిద్ధార్థ లూథ్ర పెద్ద చర్చకు దారి తీశారు. లూథ్ర సుప్రీంకోర్టులో సీనియర్ మోస్ట్ లాయర్. ఎన్నో కేసుల్లో విజయం సాధించారు. సక్సెస్ ఫుల్ లాయర్ కావడంతో నిత్యం బిజీగా ఉంటారు. ఒక్కో కేసు విచారణకు లక్షల్లో తీసుకుంటారని ప్రచారం ఉంది. గంటలకు లక్షలు తీసుకుంటారని కూడా టాక్ నడిచింది. దేశంలో ఏ కోర్టులనైనా వాదించేందుకు సిద్ధమని..ప్రత్యేక విమానాల్లో వచ్చి వాదించిన సందర్భాలు కూడా ఉన్నాయని ఎన్నో రకాల విశ్లేషణలు ఉన్నాయి. అటువంటి సిద్ధార్థ లూథ్ర ఇప్పుడు టిటిడి లడ్డు కేసులో వాదనలు వినిపించడం విశేషం.అప్పట్లో చంద్రబాబు టిడిపి అధినేత. ఓ రాజకీయ పార్టీ నాయకుడు. కచ్చితంగా



టిడిపి లాయర్ ఖర్చులు అప్పట్లో భరించి ఉంటుంది. కానీ ఇప్పుడు టీటీడీ లడ్డు వివాదం కేసులో లూథ్ర వాదనలు వినిపిస్తున్నారు. అయితే ఆయనకు ఫీజు టీటీడీ చెల్లిస్తుందా?లేకుంటే ప్రభుత్వం చెల్లిస్తుందా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. లక్షలాది రూపాయలు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ఎవరు చెల్లిస్తారో? అన్నది మాత్రం బయటకు తెలియడం లేదు. టీటీడీ చెల్లిస్తే మాత్రం ప్రత్యర్థులకు ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది.

# సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తూ..

జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ 5వ డివిజన్ కి సంబంధించిన సీఎం సహాయ నిధి చెక్కులను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,కార్పొరేటర్లు బొడిగే స్వాతి కృష్ణ గౌడ్,భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి,సీనియర్ నాయకులు యాసారం మహేష్,కో ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. సీఎం సహాయ నీది ఆపద్భందువునిగ ఆపద సమయంలో ఆదుకుంటుందని తెలిపారు. వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తూ ఆరోగ్య భరోసాను కల్పిస్తుందని, పేదల సంక్షేమనికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, బొడిగే స్వాతి కృష్ణ గౌడ్, సీనియర్ నాయకులు యాసారం మహేష్,కో ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.





## సీఎం రిలీఫ్ ఫండ్ తో పేదలకు ఆసరా

- డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి

జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 04 :

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని అలాగే రాష్ట్రంలోని పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేలూరులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇందుకోసం రాష్ట్రంలో పేదవారి జీవితాలలో వెలుగులు నింపడమే ప్రధాన ధ్యేయంగా ముందుకెళుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, నాయకులు తోట ముత్యాలు, కీసర వెంకటేష్, గోవర్ధన్ రెడ్డి, బాలెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గాయత్రి మాత.. సల్లగా చూడమ్మా

- శ్రీ విద్యాదరి క్షేత్రంలో రెండవ రోజు గాయత్రి మాత అవతారం

జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 04 :

వర్గల్ శ్రీ విద్యా సరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శ్రీ విద్యా సరస్వతి అమ్మవారు శ్రీ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థకు చైర్మన్ యమవరం చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో కార్యక్రమాలకు అంకురార్పణ నిర్వహించారు. ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

## దామోదర.. దామోదర... అవినీతికి నువ్వే రాజపుత్రుడువా..?

- సరిలేరు నీకెవ్వరు కలెక్షన్ కింగ్ అవినీతికి బ్రాండ్


జయభేరి, ఎల్బీనగర్ :



ఎల్బీనగర్ జోనల్ సరూర్నగర్ సర్కిల్లో నయాడాన్ చైన్ మెన్ దామోదర్ హవా పతాక స్థాయిలో నడుస్తోంది. ఎవరిని లెక్క చేయకపోవడం ఇతని నైజం. అధికారులైన రాజకీయ నాయకులైన నా చెప్పు చేతల్లో ఉంటారని ఈతగాడి నమ్మకం. ప్రస్తుతం సరూర్నగర్ సర్కిల్లో ఎక్కడ అక్రమ నిర్మాణం జరగాలన్న ఇతగాడిని ప్రసన్నం చేసుకుంటే చాలు ఇక అక్రమ నిర్మాణం పూర్తిస్థాయిలో ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తవుతుంది. మచ్చుకు గౌతమ్ నగర్ లోని అక్రమ నిర్మాణం మరియు పివిన్టి కాలనీ అక్రమ నిర్మాణం మనకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. ఇతగాడు ఏం మాయ చేస్తాడో తెలియదు గానీ అక్రమాలు జోరు మీద నడుస్తాయి. అధికారులు కూడా ఇతగాడి విషయంలో ఏమి తెలియనట్టు ప్రవర్తిస్తారు. ఇంతకుముందే ఇతర పత్రికలలో ఇతగాడి లీలలు ప్రచురించడం జరిగింది. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ప్రవర్తిస్తూ ఇతగాడి అవినీతిలో భాగమవుతున్నట్టు తెలియ వస్తుంది. ఇలాగే వదిలేస్తే మరికొద్ది రోజుల్లోనే సరూర్నగర్ లో సమాంతర ప్రభుత్వ నడిపే అవకాశం ఉంది. ప్రభుత్వాన్ని నష్టపరచడమే కాకుండా అక్రమాలను ప్రోత్సహిస్తూ లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నట్టు స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

ఇతగాడి లీలలు మరొక కథనంలో...

## ఆకట్టుకున్న చిన్నారి తమోజ్ఞ



జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 04 :

శ్రీ విద్యాధరి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నృత్య కళా ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం హైదరాబాద్ కు చెందిన చిన్నారి సింగంశెట్టి తమోజ్ఞ వల్లి చేసిన నృత్య కళా ప్రదర్శన సబికులచే శెభాష్ అనిపించింది. శ్రీమతి గొల్లపల్లి లలిత ధనలక్ష్మి (లలిత ఫైన్ ఆర్ట్స్) వద్ద శిక్షణ పొందిన ఆ చిన్నారి భరతనాట్యంలో వివిధ ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొంది పలువురు ప్రముఖులచే ప్రశంసలు అందుకుంది. కాగా వర్గల్ క్షేత్రం వద్ద హిందోళ రాగం ఆది తాళంలో మామతు శ్రీ సరస్వతి పాట ద్వారా తన విశేష అభినయాన్ని ప్రదర్శించి అమ్మవారి ఆశీస్సులు అందుకుంది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చిన్నారి తమోజ్ఞ వల్లిని అమ్మవారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.

## వంటిమామిడి లో బేకరీ ప్రారంభం



జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 04 :

ములుగు మండలంలోనే వంటిమామిడి గ్రామం దినదిన అభివృద్ధి చెందుతుందని బారాస రాష్ట్ర యూత్ విగ్ మెంబర్ జుబేర్ తెలిపారు. ఒంటిమామిడిలో అయ్యంగారి బేకరీ ప్రారంభించిన అనంతరం షాపు యజమాని అభినందించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ నవీన్ కుమార్, నరేందర్, సీనియర్ నాయకుడు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ గౌతమ్

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచన

జయభేరి, అక్టోబర్ 4:




ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రల్లో కల్పిస్తున్న మౌళిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మూడుచింతలపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తాతో కలిసి కలెక్టర్ గౌతం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు భేషుగ్గా ఉన్నాయని, వీటిని వంద శాతం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా . రోజుకు ఎంత మంది ఓపి పెషంట్లు వస్తారని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. ఓపి పెషంట్ల సంఖ్యను పెంచేలా ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుండి అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో అందించే వైద్య సేవల రికార్డుల గురించి అడిగి రిజిష్టర్లను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ గురించి అడిగి వాటి నమోదు రిజిష్టర్లను తనిఖీ చేసారు. రిజిష్టర్లలలో ఎప్పటి రికార్డులను అప్పుడే నమోదు చేయాలని రిజిష్టర్లలలో ఖాళీలు ఉండకూడదని సూచించారు. వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో జ్వరంతో వచ్చే పేషంట్లకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఓ రఘునాథస్వామి, మెడికల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.



## కర్బూజా మిద దుర్గామాత చిత్రం




జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 04 :

దుర్గాదేవి శరన్నవరాత్రులు పురస్కరించుకుని కర్బుజ కాయ మీద కళానైపుణ్యంతో అమ్మవారి చిత్రాని శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యకలు రామకోటి రామరాజు చిత్రకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మదయ ఉంటే అన్ని జరుగుతాయన్నారు. దుర్గాదేవి నవరాత్రులు కూడా భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.

## నేడు విష్ణు శివాలయంలో చండీ హోమం

- భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ చైర్మన్ ఉమా మహేశ్వరి

జయభేరి, అక్టోబర్ 4:



మేడ్చల్ జిల్లా ఉద్దేమర్రి గ్రామంలోని శ్రీ విష్ణు శ్రీ శివాలయంలో ఈ నెల 5 న చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆడేపు ఉమామహేశ్వరి వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి చండీ హవన కార్యక్రమం, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అతి పురాతనమైన ఈ ఆలయంలో అమ్మవారు ఎంతో మహిమాన్వితమైనదని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని వెల్లడించారు. ఈ చండీ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## అధునాతన పద్ధతులతో నిర్మాణ పనులు

- నూతనంగా నిర్మిస్తున్న తహశీల్దారు కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



జయభేరి, అక్టోబర్ 4:

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి లో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అదనపు కలెక్టర్ రాధిక గుప్త కలిసి పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు నిర్మాణ పనులపై పలు సలహాలు సూచనలు తాసిల్దార్ వెంకట నరసింహారెడ్డికి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ అద్దెభవనంలో ఉంటున్న తహాసీల్లారు కార్యాలయానికి సొంత భవన నిర్మాణ పనులను పర్యవేక్షించినట్లు తెలిపారు. కార్యాలయ నిర్మాణంలో రికార్డులను సరైన విధంగా భద్రపరిచేలా స్టాంగ్ రూమ్ లను అధునాతన పద్దతులతో నిర్మించాలని అన్నారు. కంప్యూటర్ రూములు, సిబ్బందికి, కార్యాలయానికి వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఎన్ని రోజులలో నిర్మాణ పనులు పూర్తచేస్తారో మరియు ఇప్పటి వరకు ఎంత ఖర్చు పెట్టారు, ఇంకా ఎంత ఖర్చు అవుతుందని తదితర విషయాలను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు.

# ఆయిల్ పామ్ రైతుకు అవగాహన సదస్సు

- ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి
- ఉద్యాన శాఖ వారి సహకారంతో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండల కేంద్రంలోని కొండభీమన పల్లి గ్రామ పరిధిలో ఉన్న రైతు వేదికలో శుక్రవారం ఉద్యాన శాఖ వారి సహకారంతో, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ నల్గొండ జిల్లా ఆయిల్ పామ్ రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ శాసనసభ్యులు నేనావాత్ బాలు నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ లాభాలు ఆర్జించేందుకు అవకాశముందని అన్నారు.రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తరువాత నాలుగో సంవత్సరం నుంచి దిగుబడులు ప్రారంభం అవుతాయని, 25 సంవత్సరాల వరకు ఈ మొక్క దిగుబడి ఇస్తూ రైతులకు ఆదాయాన్ని ఆర్జించి పెడుతుందన్నారు.ఆయిల్ పామ్ వల్ల కలిగే లాభాలు గురించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఆసక్తి అనుకూల పరిస్థితులు కలిగి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తోందన్నారు. ఈ పంట దిగుబడిని మార్కెటింగ్ చేయడం కూడా ఎంతో సులభమని, ముందస్తుగానే ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు వచ్చి నిర్ణీత మద్దతు ధరకు కొనుగోలు చేసి తీసుకెళ్తాయన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టిసారించేలా చూడాలని ఉద్యాన, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా,మాజి ఎంపీపీ జాని యాదవ్,మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవేందర్ నాయక్ ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన విభాగ నాయకులు రైతులు, హార్టికల్చర్ అధికారులు డి హెచ్ ఎస్ ఓ సాయి బాబా, ఏ పి డి శ్రీనివాసులు,డి జి ఎం యాదగిరి, సుబ్బ రెడ్డి, కిరణ్,రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







## గాయత్రి మహా క్షేత్రంలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- కామాక్షి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**జయభేరి, అక్టోబర్ 4:**

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపల్ లోని శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కన్నుల పండుగగా జరుగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపకులు వాక్ బ్రహ్మ, శిష్య జనోద్ధారక, డాక్టర్ ఎస్వీ ఎల్ ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అమ్మవారిని కంచి కామాక్షి దేవిగా అలంకరించి భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలం లోని భక్తులతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కొల్తూర్ గ్రామంలో విషాదం

- ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ముగ్గురు చిన్నారులు మృతి



**జయభేరి, అక్టోబర్ 4:**

చెరువులోకి వెళ్ళి ప్రమాదవశాత్తు ముగ్గురు బాలురు మృతి చెందారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా కొల్తూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాల శేఖర్ మని హర్ష, సలేంద్రి హర్ష వర్ధన్, విరబోయిన మనోజ్ ముగ్గురు స్నేహితులు శుక్రవారం మధ్యాహ్నం సరదాగా స్థానిక చెరువైన. అట్టి చెరువులోకి దిగారు. అయితే వారు ముగ్గురు సరదాగా ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశత్తు చెరువు లో పడిపోయారు. అయితే వీరికి ఈత రాకపోవడంతో వారు నీట మునిగి మృత్యువాత పడ్డారు. దీంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దేవీ నవరాత్రుల్లో భాగంగా అన్న ప్రసాదం



**జయభేరి, దేవరకొండ :**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం శ్రీ వాసవి మాత ధనలక్ష్మి అలంకారంతోను శ్రీ రాజరాజేశ్వరి మాత అన్నపూర్ణ అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం వాసవి మాత కు అభిషేకం, కనకాభిషేకం 108 మంది వాసవి మహిళలచే కుంకుమ పూజ నిర్వహించారు. సహస్ర కుంకుమార్చన తీర్థప్రసాద వినియోగం అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చేదెళ్ల వెంకటేశ్వర్లు కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రచార కమిటీ చైర్మన్ రాచమల్ల వెంకటేశ్వర్లు, వాసవి కళ్యాణ మండపం గౌరవ అధ్యక్షులు వనపర్తి మురళి, స్వర్ణ రథం నిర్మాణ కమిటీ సభ్యులు విడియాల వెంకటేశ్వర్లు, వనం వెంకటేశ్వర్లు, కర్నాటి పురుషోత్తం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సముద్రాల సింహం, సముద్రాల చంద్రశేఖర్, బికుమాళ్ళ లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు వాసవి క్లబ్ అధ్యక్షులు నీలా భిక్షమయ్య, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొణుకునూరు విజయ, ఆర్యవైశ్య సంగం మహిళా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరుగకుండా హెల్మెట్ ధరించాలి




**జయభేరి, వరంగల్ :**

రోడ్డు ప్రమాదాలు జరుగకుండా హెల్మెట్ ధరించాలనీ సేఫ్టీ(CRSB) ఇన్స్పెక్టర్ B.శ్రీనివాస రావు అన్నారు. సిపి ఆదేశాల మేరకు ములుగు రోడ్డు లోని రామప్ప జూనియర్ కాలేజీ లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ B.శ్రీనివాస రావు రోడ్డు ట్రాఫిక్ నియమాల గురించి నియమాలు ఉల్లంఘిస్తే ట్రాఫిక్ పోలీసులు విధించే చలాన్ల గురించి ట్రాఫిక్ ఉల్లంఘన వల్ల జరిగే అనర్థాల గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది. ఇంకా వరంగల్ కమిషనరేట్ లో ప్రతి నెలా జరిగే రోడ్డు ప్రమాదాలు, అవి జరగడానికి గల కారణాలు అవి జరగకుండా ఉం డటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి అందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్ ఎ వరూ చేయ కూడదని, 18 సంవత్సరాలు నిండిన వారందరూ డ్రైవింగ్ లైసెన్స్ కొరకు అప్లై చేసుకోవాలని తెలపడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఇన్స్పెక్టర్ B.శ్రీనివాస రావు సిబ్బంది ఆర్ఎస్ఐ నవీన్ కుమార్, ఏఎస్ఐ వేణు గోపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజు, రామప్ప కాలేజి ఇన్చార్జి కమల్, 150 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాశాలలోని వాహనాలు నడుపు డ్రైవర్లు హాజరైనారు.

## పోతారంలో ఇంటింటి డిజిటల్ సర్వే

- సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలు-కలెక్టర్ గౌతమ్

**జయభేరి, అక్టోబర్ 4:**



ఇంటింటి డిజిటల్ సర్వేలో ఏలాంటి తప్పులు జరుగకుండా పకడ్బందీగా వివరాలను నమోదు చేయాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పొట్రు అధికారులను ఆదేశించారు. మూడుచింతలపల్లి మండలం పోతారం గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేలో నమోదైన వివరాల నివేదికలను జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా తో కలిసి కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో కుటుంబాల వివరాలను తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా సర్వేలో కుటుంబాల వివరాలను పారదృకంగా సేకరించాలన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో మహిళలను యజమానులుగా నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులు గ్రామంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరుకు వినతి పత్రం అందజేసారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామనీ వారికి హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, డిపిఓ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (ఎమ్మెల్సీ) బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, నిజామాబాద్ బహిరంగ సభకు వెళుతున్న క్రమంలో వారికి మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికి శాలువా, పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన డీసీసీ హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి వజ్రేష్ యాదవ్, మాజీ శాసన సభ్యులు మలిపెద్ది సుదీర్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు, భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**

## సీసీ రోడ్డు పనులను ప్రారంభం

**జయభేరి, ఘట్కేసర్ :**





పోచారం మున్సిపల్ పరిధిలోని పోచారం 13వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. శుక్రవారం పోచారం మున్సిపల్ పరిధిలోని పోచారం సంస్కృతి టౌన్షిప్ లింకు రోడ్డు అంచనా వ్యయం దాదాపు 25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించరు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పోచారం మున్సిపాలిటీ లో అన్ని వార్డులలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని దశలవారీగా అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్ వీరారెడ్డి, ఏఈ మహిపాల్, నాయకులు సామల బుచ్చిరెడ్డి, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని సాయిప్రియ నగర్ రోడ్ నంబర్ 1 దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సమృద్ధి అమృతాలయ టీ పాయింట్ ప్రారంభోత్సవానికి యాజమాన్యం వారి ఆహ్వానం మేరకు హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపిన నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. స్థానిక వ్యాపార అభివృద్ధికి ప్రోత్సాహం అందించడంలో ఇలాంటి చిన్న వ్యాపారాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఈ కొత్త టీ పాయింట్ స్థానికులకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రాంత ప్రజలు సైతం ఈ కార్యక్రమానికి హాజరై, కొత్తగా ప్రారంభమైన టీ పాయింట్ ద్వారా అందించే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో యాజమాన్యం సభ్యులు పవన్, సాల్మన్, సాగర్, హర్ష, సురేష్, అరుణ్, డ్యానీ, తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**

## మున్సిపల్ కార్మికులకు బట్టల పంపిణి

**జయభేరి, ఘట్కేసర్ :**





పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో మున్సిపల్ కార్మికులకు వస్త్రాలను పంపిణి చేసిన మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి. శుక్రవారం పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో తమ నివాసంలో తన తల్లిదండ్రులైన బోయపల్లి మల్లారెడ్డి దశలక్ష్మి గర్ల చేతులమిదుగా పోచారం మున్సిపల్, విలీన గ్రామాల కార్మికులు దాదాపూ 360 మందికి వస్త్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడు..తూ ప్రతి ఏడు లాగానే ఈసారి కూడా బట్టల పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈసారి విలీన గ్రామాల కార్మికులకు మా అమ్మానాన్న చేతుల మీదుగా అందించడం చాల సంతోషంగా ఉంది అని తెలిపారు. ఈ



కార్యక్రమంలో కమీషనర్ వీరా రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ వాణి, బోయపల్లి సత్తి రెడ్డీ, రాజేశ్వర్ రెడ్డి, కరుణాకర్, ఉమ శంకర్, రఘు రాం రెడ్డి, ప్రణాత్, వర్శిత్, రవీందర్ మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిరుపేదల వైద్యానికి అండగా ప్రభుత్వం



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన బి.భువనేశ్వర్ రాజు తరపున వైద్య నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన రూ.2,50,000 / యల్.ఓ.సి లెటర్ లను లబ్ధిదారులకు అందజేసిన పీర్జాదిగూడ 26వ డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజి రెడ్డి. ఈ సందర్భంగా 26వ డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. పేదలకు, నిస్సహాయులకు వైద్యపరంగా అనుకోకుండా ఆపద వస్తే 2 రోజుల్లోనే CMRFLOC ద్వారా వైద్య ఖర్చులకు అయ్యే మొత్తం ప్రభుత్వం ద్వారా డబ్బులకు లెటర్ మంజూరు చేసి నేనున్నానని భరోసా ఇస్తు ఆపదలో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ పాశం, శ్రీకాంత్ పటేల్, సాయి సురేందర్, మధుసూదన్ గౌడ్, మల్లికార్జున్ యాదవ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.




# స్పై యూనివర్స్ ఆల్ఫా..

## ఉద్వేగపూరిత సన్నివేశాలు, ఊహించని మలుపులు!

యష్‌రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న స్పై యూనివర్స్ మూవీ 'ఆల్ఫా'. ఆదిత్య చోప్రా నిర్మాణ సారథ్యంలో రూపొందుతోన్న ఈ భారీ యాక్షన్ ఎంటైర్టైనర్‌కు శివరావెల్ దర్శకుడు. వచ్చే ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న సినిమా విడుదల కానుంది. అలియాభట్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో శార్వారి కీలక పాత్ర పోషిస్తున్నది. అలియా, శార్వారీ ఇందులో సూపర్ ఏజెంట్‌స్‌గా నటిస్తున్నారని, స్పై యూనివర్స్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం దర్శకుడు శివ్ రావెల్ ప్రతిభకు అద్దం పడుతుందని మేకర్స్ చెబుతున్నారు. స్టన్నింగ్ విజువల్స్, ఉద్వేగపూరిత సన్నివేశాలు, ఊహించని మలుపులతో అద్భుతంగా 'ఆల్ఫా' ఉంబోతున్నదని మేకర్స్ పేర్కొన్నారు.





# తాప్సీ ఆ హీరోల గురించి ఏమన్నరో తెలుసా ?

తెలుగు సినీ పరిశ్రమకు నార్త్ నుండి వచ్చిన కథానాయికల్లో తాప్సీ ఒకరు. ఝుమ్మందినాథంతో తెలుగు సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన ఈ అందాలభామ తొలిచిత్రంతోనే కుర్రకారును అలరించింది. ఆ తరువాత అనతి కాలంలోనే టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారింది. అయితే ప్రస్తుతం తెలుగు సినిమాలను తగ్గించిన తాప్పీ ఇప్పుడు బాలీవుడ్‌లో బిజీ కథానాయికగా గా మారింది. అయితే తెలుగులో సినిమాలు తగ్గించిన ఈమె ఒకప్పుడు తెలుగులో క్రేజీ హీరోలందరితోనూ జతకట్టింది. ప్రభాస్‌తో మిస్టర్ పర్‌ఫెక్ట్ చిత్రంలో నటించాను. ఆయన అందగాడు. నా ఎత్తుకు నేను ఆయనకు జోడిగా బాగా సరిపోయాను అని అందరూ అన్నారు. నేను మొదట్లో మిస్టర్ పర్‌ఫెక్ట్ చిత్రంలో నటించడానికి సంకోంచించాను. ఎందుకంటే ఆ తరువాత అన్ని రెండో హీరోయిన్ పాత్రలే వస్తాయని అనుకున్నాను. ఆ సినిమా సాధించిన విజయంతో నాకు మంచి పేరు వచ్చింది' అని తెలిపారు. రవితేజ అంటే అసలు సిసలు ఎనర్జీ ఎలా వుంటుందో చూడొచ్చు. ఆయనతో షూటింగ్ అంటే మనకు కూడా హుషారు వస్తుంది. నేను రవితేజతో కలిసి వీర చిత్రంలో నటించాను. ఆ సినిమా సెట్‌లో మార్నింగ్ నుంచి ఈవెనింగ్ వరకు అదే హుపారు. ఆయన్ని చూస్తుంటే మనకు ఎనర్జీ వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది' అంటూ చెప్పుకొచ్చారు తాప్సీ. ప్రస్తుతం పలు బాలీవుడ్ ప్రాజెక్టులతో బిజీగా వున్నరు తాప్సీ పన్ను.



# వస్తా.. వస్తానులే

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని మూడో గీతం 'వస్తానులే..' శుక్రవారం విడుదలైంది. చేతన్ భరద్వాజ్ స్వరపరచిన ఈ గీతాన్ని వెంగి రచించారు. కపిల్ కపిలన్ ఆలపించారు. ఈ రొమాంటిక్ గీతంలో నాయకానాయికలు గోపీచంద్, కావ్యా థాపర్‌ల కెమిస్ట్రీ ఆకట్టుకుంది. విజువల్స్ బాగున్నాయి. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్ అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, గోపీచంద్ పాత్ర మును పెన్నడూ చూడని విధంగా కొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, సంగీతం: చేతన్ భరద్వాజ్, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి, దర్శకత్వం: శ్రీను వైట్ల.

# మిస్టర్ ఇడియట్ టీజింగ్

అగ్ర హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడైన మాధవ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్‌శర్మ కథానాయిక. 'పెళ్లిసందడి'ఫేం గౌరి రోణంకి దర్శకత్వంలో జె.జె.ఆర్.రవిచంద్ర ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి 'కాంతారా.. కాంతారా..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను అనూప్ రూబెన్స్ స్వరపరచగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. కాలేజ్‌లో హీరోయిన్‌ను టీజ్ చేస్తూ హీరో ఈ పాట పాడతాడనీ, యువతరాన్నికి నచ్చే సినిమా ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: శ్యామ్, వంశీ, కెమెరా: రామ్‌రెడ్డి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com